# తెలంగాణలో గౌడన్నల బతుకులు మారాయి

■ అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

■ తెలంగాణలో కుల వృత్తులకు పూర్వవైభవం
■ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, భిక్షపతి
■ తాలెల్మలో గౌడన్నల ఆత్మీయ సమ్మేళనం
■ వేలాదిగా తరలివచ్చిన గీత కార్మికులు
■ అండగా ఉంటా... ఆశీర్వదించండి..
■ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

అందోల్, నవంబర్ 20 : తెలంగాణ ఏర్పడి.. బీఆర్ఎస్ ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత గౌడ కులస్తులు, గీత కార్మికుల బతుకులు మారాయని అందోల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. అందోల్ మండలం తాలెల్మ గ్రామంలోని రేణుకాఎల్లమ్మ ఆలయం ఆవరణలో గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రాంతికిరణ్‌తోపాటు కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్‌గౌడ్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి హాజరయ్యారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులకు పూర్వ వైభవం కల్పించిందన్నారు. గీతకార్మికులు, గౌడ కులస్తులకు అన్నిరకాలుగా అండగా ఉన్నది బీఆర్ఎస్ ఒక్కటే అన్నారు. అందోల్, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లో భూములను సస్యశ్యామలం చేసేందుకు నిర్మించిన ప్రాజెక్ట్‌కు గౌడ కులస్తుల కులదైవం రేణుకా ఎల్లమ్మ పేరు పెట్టామని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చితికిపోయిన కుల వృత్తిదారుల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారన్నారు. అందుకు కృతజ్ఞతగా మీరందరూ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గీత కార్మికులకు పెన్షన్లు, ఇన్సురెన్స్ కల్పించిందని, వ్యాపార నిర్వహణకు వాహనాలు, పనిముట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటే బతుకులు మెరుగుపడుతాయని, కాంగ్రెస్ మాటలు విని ఆగం కావొద్దని.. బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. గౌడ కులస్తులకు అన్యాయం చేసినది కాంగ్రెస్ అని, వారి హయాంలోనే కల్లుదుకాణాలు మూతపడ్డాయని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతే... గౌడ బిడ్డను మంత్రిని చేసి కల్లు దుకాణాలు మళ్లీ తెరిపించి...గౌడన్నలను కంటికి రెప్పాలా కాపాడుతున్నారని తెలిపారు. కేసీఆర్‌ను సీఎం చేస్తే గౌడన్నల బతుకులు బాగుపడుతాయన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే కల్లు దుకాణాలకు తాళం**

**★ కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి**



కల్లు దుకాణాలకు తాళం వేసి, గౌడన్నల బతుకులను ఆగం చేసింది కాంగ్రెస్ అని, ఆ పార్టీని ఖతంచేసి బీఆర్ఎస్ ను గెలిపించాలన్నారు. హైదరాబాద్ తోపాటు చుట్టు పక్కల కల్లు దుకాణాలు మూతపడ్డాయని, దీంతో గౌడన్నలు, గీత కార్మికులు పనులు లేక పస్తులు ఉన్నారని తెలిపారు. అప్పటి ప్రభుత్వంలో ఇప్పటి కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ మంత్రిగా ఉన్నా.. గౌడన్నల కష్టాలపై స్పందించ లేదని విమర్శించారు. ఇప్పుడు ఆయనకు ఓటేస్తే మన బతుకులు మనమే ఆగం చేసుకున్నోళ్లం అవుతామన్నారు. మనతో ఉండే నాయకుడు, మనలో ఒకడు క్రాంతికిరణ్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించి, ఆశీర్వదించాలన్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి మాట్లాడుతూ.. జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు అందోల్‌పై పూర్తి పట్టున్న నాయకుడు క్రాంతికిరణ్ అని, మరొసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేస్తాడని పేర్కొన్నారు. గౌడన్నలకు అన్ని రకాలుగా అండగా ఉన్న బీఆర్ఎస్‌ను విస్మరించొద్దని... ఎన్నికల్లో క్రాంతికిరణ్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపాలని మఠం భిక్షపతి కోరారు.

గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి అందోల్, వట్‌పల్లి, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, మునిపల్లి, పుల్కల్, చౌటకూర్, రాయికోడ్ మండలాల నుంచి గౌడ సంఘం నాయకులు, యువత పెద్దఎత్తున తరలివచ్చారు. సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ క్రాంతికిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ వైస్‌చైర్మన్ జైపాల్‌రెడ్డి, రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షుడు ప్రతాప్‌లింగాగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ఆశన్నగౌడ్, రమేశ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు లింగాగౌడ్, అశోక్‌గౌడ్, రామాగౌడ్, ప్రతాప్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



అందోల్: క్రాంతికిరణ్‌కు మద్దతు తెలుపుతున్న గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు



అందోల్: గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన గౌడ సోదరులు, గీత కార్మికులు

# ఆర్వో కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

పటాన్‌చెరు, నవంబర్ 20 : ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ పరిశీలించారు. ఆర్వో దేవుజాను ఎన్నికల ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో వరుసగా చేయాల్సిన పనులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పోలింగ్ బూత్‌లు, వాటిలో కల్పించే సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల అధికారులకు ప్రణాళిక ప్రకారం పనులు అప్పగించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ సమస్య వచ్చినా తక్షణమే జిల్లా కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. రుద్రారంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంల వద్ద గట్టి బందోబస్తు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ఆడ పిల్లలను చదివించాలి

■ జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి సంధ్యారాణి




బాలికా విద్య ప్రాముఖ్యత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 20 : 'ఆడ పిల్లలను రక్షించండి – చదివించండి' అని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి పేర్కొన్నారు. భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు పాటలు, ఉపన్యాస, నృత్య పోటీలు నిర్వహించారు. అనంతరం సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ బాలికల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలు తెచ్చాయన్నారు. అవకాశాలను బాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదవాలని, తద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ రఘు, డీసీఆర్బీ సీఐ రమేశ్, ఎస్సై సోమేశ్వరి, మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రోజా, భరోసా, సఖీ బృందాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




విజయ సంకేతాన్ని చూపుతున్న అధికారులు, టీచర్లు, విద్యార్థినులు

# ఆలోచించి ఓటేయండి

■ కాంగ్రెస్, బీజేపీలతో ఒరిగేదేమీ లేదు
■ సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి
■ అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతి కిరణ్
■ బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

అల్లాదుర్గం, నవంబర్ 20 : ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, ముప్పారం గ్రామా ల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డప్పు చప్పట్లు, మహిళలు మంగళహారతులతో క్రాంతికిరణ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు వివరిస్తూ కారు గుర్తు కు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమొద్దు,ఆ పార్టీలతో ఒరిగేదేమి లేదన్నారు. రాష్ట్ర ప్రజల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించి రైతులను రాజు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని,10 హెచ్‌పీ మోటరు బిగించాలని అనడం సిగ్గుచేటన్నారు. రైతులు 24గంటల కరెంట్ కావాలా, 3 గంటలు కావాలా ఆలోంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇక ముందు కూడా ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, గీతా కార్మికుల కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, మాజీ అధ్యక్షుడు బ్రహ్మం, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు వరప్రసాద్, సర్పంచ్ మల్లేశం, ఎంపీటీసీ దశరథ్, బీఆర్ఎస్ నాయకులు ప్రకాశ్, పవన్, రవి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చంటి కాంత్రికిరణ్



అల్లాదుర్గంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్

# పటేల్‌గూడలో ఛట్‌పూజ

■ అలరించిన భోజ్‌పురి సినీనటులు
■ విభిన్న సంస్కృతికి నిలయం పటాన్‌చెరు



ఛట్ పూజా కార్యక్రమానికి హాజరైన ప్రజలు

అమీన్‌పూర్, నవంబర్ 20 : ఉత్తర భారతీయులు ప్రతి ఏటా దీపావళి పర్వదిన సమయంలో వారం రోజులు పాటు నిర్వహించే ఛట్‌పూజ కార్యక్రమాన్ని వైభవోపేతంగా పటాన్‌చెరు ప్రాంతంలో నిర్వహించడం ఆనవాయితీ కొనసాగుతున్నది. అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడలో ఉత్తర భారతీయుల అసోయేషన్ అధ్వర్యంలో సోమవారం ఛట్ పూజ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భోజ్‌పురి సినీనటులు కేసరలాల్, అక్షర సింగ్ ముఖ్యఅతిథులు వచ్చి, తమ పాటలతో ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేశారు. సంస్కృతిక, సంప్రదాయక కార్యక్రమాలను ప్రదర్శించారు. బీహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో ఛట్‌పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉత్తర భారతీయుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.